సాక్షి సంగారెడ్డి

శనివారం, 5, ఆగస్టు, 2023



కిరాణా సామగ్రి తెస్తుండగా..

బైక్, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఒకరికి గాయాలయ్యాయి. ఈ విషాద సంఘటన మండలంలోని తునికి సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. 8లో



సర్కారు బడి..

సర్కారు బడులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రహరీలు లేక అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. విద్యార్థులకు మద్యం బాటిళ్లు, సిగరెట్ పీకలు, తినుబండారాలు దర్శనమిస్తున్నాయి. 9లో

నేడు బస్సులు బంద్

మెదక్: ఆర్టీసీ బిల్లు ఆమోదంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా శనివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు బస్సులు బంద్ చేస్తున్నామని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఆర్‌కే రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికైనా గవర్నర్ స్పందించి ప్రభుత్వం సిఫారసు చేసిన ఆర్టీసీ బిల్లును ఆమోదించాలని కోరారు. లేనిపక్షంలో సిబ్బందితో కలిసి పెద్ద ఎత్తున నిరసనలు చేస్తామని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

నేడు ఉద్యోగ మేళా

కొండాపూర్(సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలోని సాధన డిగ్రీ కళాశాలలో శనివారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవి, కరస్పాండెంట్ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ మేళ ఎస్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో కొనసాగుతుందన్నారు. 27 ఏళ్ల లోపు వయసు కలిగి, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఉద్యోగ మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 90320 603 93, 96426 34967ను సంప్రదించాలన్నారు.

ప్రజాప్రతినిధులను అడ్డుకున్న దళితులు

- దళితబంధు అందరికీ ఇవ్వాలని డిమాండ్



జెడ్పీ వైస్ చైర్మన్‌తో వాగ్వాదం

జిన్నారం(పటాన్‌చెరు): దళితబంధు అందరికీ ఇవ్వాలంటూ ప్రజాప్రతినిధులను దళితులు శుక్రవారం అడ్డుకున్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు జిన్నారానికి వచ్చారు. జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను అడ్డుకుని నిరసన తెలిపారు. నిరుపేదలైన దళితులకు కాకుండా కేవలం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారికే దళితబంధును వర్తింపజేస్తున్నారని మండిపడ్డారు. ఇది సరైంది కాదని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. జిన్నారం గ్రామా నికి చెందిన ప్రజాప్రతినిధులతో మాట్లాడుతానని ప్రభాకర్ వారికి సూచించారు. అర్హులందరికీ న్యాయం జరుగుతుందని, భయపడాల్సిన అవసరం లేదని ప్రభాకర్ అన్నారు.

గొర్రెల కాపరులు ఆర్థికంగా ఎదగాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరియాదవ్



నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేస్తున్న శ్రీహరి

జహీరాబాద్: గొర్రెల కాపరులు ఆర్థికంగా ఎదగాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి యాదవ్ అన్నారు. శుక్రవారం జహీరాబాద్‌లో గొర్రెత కాపరుల సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మల్లేశంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాపరుల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థిక అభివృద్ధిని సాధించాలని పిలుపునిచ్చారు. అర్హులైన వారికి అన్యాయం జరగకుండా కృషి చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గం, మండల స్థాయి కమిటీలను బలోపేతం చేసి పథకాలు పూర్తి స్థాయిలో అందేలా చూస్తామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రాజు, మల్లేశం, సత్యనారాయణ, విశ్వనాథ్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, నర్సింహులు, రాములు, నాగరాజు, రాజ్‌కుమార్, యాదయ్య, సభ్యులు పాల్గొన్నారు.

సింగూరు.. నిండా నీరు



సంగారెడ్డి జిల్లా పుల్కల్ లోని సింగూరు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జహీరాబాద్, నారాయణఖేడ్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటితో ప్రాజెక్టు గరిష్ట స్థాయి నీటి మట్టానికి చేరుకుంది. బ్రిడ్జి దిగువన నీళ్లు వెళ్లే కాలువ కనువిందుచేస్తోంది. డ్యామ్ పైకి ప్రజలను అనుమతించడంలేదు. బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

8న యోగా సెలక్షన్స్

కొండాపూర్(సంగారెడ్డి): యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న జిల్లాస్థాయి యోగా సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులు 9 నుంచి 14 ఏళ్లలోపు సబ్ జూనియర్ విభాగంలో, 14 నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులు జూనియర్‌లో పాల్గొనాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్ తో ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ స్టేడియానికి రావాలని, మరిన్ని వివరాలకు 94413 82238, 96769 46771ను సంప్రదించాలన్నారు.

616మంది వీఆర్‌ఏల సర్దుబాటు

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేసినట్లు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 616 మంది వీఆర్‌ఏలను రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల్లో నియమించినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగులపై ఈసీ నజర్



కలెక్టరేట్‌లో పోలింగ్ విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ వేగిరమైంది. సంబంధిత అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మరోవైపు ఎన్నికల కమిషన్ (ఈసీ) అధికారులు, సిబ్బంది వివరాలను సేకరిస్తోంది. అధికారి వేతనం ఎంత? స్వస్థలం ఏ నియోజకవర్గం పరిధిలో ఉంది? ఎక్కడ పనిచేస్తున్నారు? ప్రస్తుతం నివాసముంటున్నది ఎక్కడ? తదితర విషయాలన్నీ క్షుణ్ణంగా ఆరా తీస్తున్నారు.

- 45 రకాల వివరాల సేకరణ
- క్రిమినల్ కేసులపైనా ఆరా
- ఎన్నికల నిర్వహణకు ముమ్మర కసరత్తు
- పెరగనున్న పోలింగ్ కేంద్రాల సంఖ్య

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : ఆయా ప్రభుత్వ శాఖల్లో ఉన్న ప్రతి ఉద్యోగికి సంబంధించి మొత్తం 45 రకాల సమాచారాన్ని పంపాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రత్యేక ప్రొఫార్మా ప్రకారం ఈ సమాచారం అందించాలని సూచించింది. రానున్న ఎన్నికల నిర్వహణకు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్న ఈసీ ఇప్పటికే కీలకమైన రెవెన్యూ, పోలీసు అధికారులను పెద్ద ఎత్తున బదిలీలు చేసిన విషయం విదితమే.

బదిలీలు ముమ్మరం

సంగారెడ్డి జిల్లాకు చెందిన రెవెన్యూ తహసీల్దార్లు ఎక్కువ మందిని వికారాబాద్ జిల్లాకు వెళ్లారు. కొందరిని రంగారెడ్డి, మేడ్చల్, గద్వాల జిల్లాలకు పంపారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా అంతకు ముందే జిల్లా అదనపు కలెక్టర్లను, ఆర్డీఓలకు ప్రభుత్వం స్థానచలనం కల్పించిన విషయం తెలిసిందే. మరోవైపు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. వారి స్థానంలో కొత్త వారిని నియమించింది. ఈ రెండుశాఖలే కాకుండా, మిగిలిన ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఉద్యోగుల స్థానికేతర నియోజకవర్గాల్లో విధులు అప్పగించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగానే సమాచారాన్ని సేకరిస్తున్నారు.

లాంగ్ లీవులో ఉన్నారా?

గత ఎన్నికల్లో ఉద్యోగి ఏ పోలింగ్ కేంద్రంలో పనిచేశారు.. క్రిమినల్ కేసులు ఏమైనా ఉన్నాయా? దివ్యాంగుడైన పక్షంలో వివరాలు తెలపాలని? లాంగ్ లీవులో వెళ్లారా? ఉద్యోగంలో చేరిన తేదీ.. రిటైర్మెంట్ డేట్.. ఇలా ప్రొఫార్మలో ఎన్నో వివరాలను సేకరించి పంపాలని ఆదేశించింది. ఈ మేరకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు ఈ సమాచారాన్ని సేకరిస్తున్నారు. వేలల్లో ఉద్యోగులున్న శాఖలో ఈ వివరాల సేకరణ అధికారులకు ఇబ్బందిగా మారింది.

పలు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల విలీనం..

కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను విలీనం చేయాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈసీ ఆదేశాల మేరకు 1,400 మంది కంటే తక్కువ ఓటర్లు ఉన్న రెండు పోలింగ్ కేంద్రాలను విలీనం చేయాలని నిర్ణయించారు. మరోవైపు కొత్తగా 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ఈసీకి పంపారు. ప్రస్తుతం జిల్లాలో 1,560 పోలింగ్ కేంద్రాలు ఉండగా, రానున్న ఎన్నికల్లో 1,594కు పెంచాలని ప్రతిపాదించారు. ఆయా నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నియామకం కూడా ఇప్పటికే పూర్తయిన విషయం విదితమే. ఆయా నియోజకవర్గాలకు ఆర్డీఓలు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనుండగా, పటాన్‌చెరువు నియోజకవర్గానికి మాత్రం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారిని నియమించారు.

పకడ్బందీగా 'ఇంద్రధనుష్'



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

- పక్కా ప్రణాళిక అవసరం
- అధికారుల సమన్వయం తప్పనిసరి
- కలెక్టర్ శరత్ దిశానిర్దేశం

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో, సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపుకార్యాలయంలో ఇంద్రధనుష్ కార్యక్రమంపై వైద్య ఆరోగ్యశాఖ, అనుబంధ శాఖల అధికారులతో టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనుష్ లక్ష్యం ఐదేళ్ల లోపు పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేయించాలన్నారు. దీంతోరోగ నిరోధక శక్తి పెంపొందుతోందన్నారు. వాక్సినేషన్లు అత్యంత కీలకమని, మరిచిపోకుండా ఇప్పించేలా పట్టణ, గ్రామ ప్రాంతాలలో మహిళా సమాఖ్యల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది వ్యాక్సినేషన్ తీసుకోని పిల్లలు, గర్భిణుల లిస్టును తయారు చేయాలన్నారు. ఏ రోజు ఎక్కడ వ్యాక్సినేషన్ ఇస్తున్నారో ముందుగా సమాచారం తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్ఓ నగేశ్, మున్సిపల్ కమిషనర్ సుజాత, డిప్యూటీ డీఎంహెచ్ఓ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్ల పంపిణీ వేగిరం చేయండి

రెండో విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం పశుసంవర్ధక శాఖ జేడీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో గొర్రెల పంపిణీ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు త్వరితగతిన గొర్రెలను అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండో విడతలో ఇప్పటివరకు 342 యూనిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సమీక్షలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వసంత కుమారి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాస్ రావు, డీపీఓ సురేశ్ మోహన్, అడిషనల్ పీడీ జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ ప్రక్రియ షురూ..



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్

- 101 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ
- 18 వరకు దరఖాస్తుల స్వీకరణ

సంగారెడ్డి మున్సిపాలిటీ: మద్యం షాపుల కోసం టెండర్ ప్రక్రియ మొదలైంది. జిల్లాలో 101 మద్యం షాపులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ కమిషనర్ హరికిషన్ విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టెండర్లు వేసే ఎస్సీ, ఎస్టీ, గౌడ్ కులస్తులు కుల ధ్రువీకరణ పత్రం జత చేయాలన్నారు. ఒకవేళ లేకపోతే అఫిడవిట్ ద్వారా అవకాశం కల్పిస్తామని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ప్రతి ఒక్కరికీ సులభంగా అర్థమయ్యేలా దరఖాస్తు ఫారాన్ని రూపొందించామన్నారు. రూ.రెండు లక్షల డీడీ, పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు మూడు, పాన్, ఆధార్ కార్డు జత చేయాలన్నారు. ఎవరికైనా సందేహాలు ఉంటే నేరుగా ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఒక్క వ్యక్తి ఎన్ని షాపులకైనా టెండర్ వేసుకోవచ్చని ఆయన తెలిపారు. గతంలో ఒక వ్యక్తికి ఒకే షాప్ అనే పాలసీ ఉండేదని, అలాంటిది లేదని అన్నారు. ఏ జిల్లాలో అయినా చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో సీఐలు మధుబాబు, మానెమ్మ, మహేశ్, అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు కేసీఆర్

- చింతా ప్రభాకర్



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చింతా ప్రభాకర్, నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: రైతు బాంధవుడు సీ ఎం కేసీఆర్ అని, రుణమాఫీతో రైతుల ఇంట పండుగ వాతావరణం నెలకొందని హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ సంక్షేమంలో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నా రు. కేసీఆర్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ కసాల రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్, జెడ్పీటీసీ కొండల్ రెడ్డి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం

- విస్తృతంగా అవగాహన కల్పించాలి
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్ : తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారమని, ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు పట్టించేలా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. శుక్రవారం తన ఛాంబర్ లో మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి, మెప్మా తదితర శాఖలతో జిల్లాలో నిర్వహిస్తున్న ఆయా కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి తల్లిపాల ప్రయోజనాలపై వివరించాలని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలోని తండాలు, రిమోట్ ఏరియాలు, మురికి వాడలు, ఎస్సీ వాడలు, మున్సిపల్ పరిధిలోని అన్ని ఏరియాల్లోని సీజనల్ వ్యాధులు, శానిటేషన్ పై అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్య పరచాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన పోస్టర్ ను ఆవిష్కరించారు. సమీక్ష సమావేశంలో డీడబ్ల్యూఓ పద్మావతి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, మెప్మా పీడీ గీత, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా గ్రామీణ అభివద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మన బడి' పనులు ముమ్మరం చేయండి

సంగారెడ్డి టౌన్: మన ఊరు మనబడి సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండలాల ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు.. అదురుతున్న గుండెలు





సంగారెడ్డి శివారులోని దారులు ఇలా..

సంగారెడ్డి నుంచి ఫసల్ వాది వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడా అడుగు మేర గుంతలు పడ్డాయి. కొన్ని చోట్ల నీళ్లు ఉండటంతో గుంతలు కనిపించడం లేదు. దీంతో వాహన దారులు ప్రమాదాల బారినపడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

\- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

డబుల్ బెడ్రూం కోసం నడిరోడ్డుపై హల్‌చల్

- కేటాయించిన ఇంటిని అప్పగించాలని డిమాండ్
- వాహనాలను అడ్డగిస్తుండగా బస్సు కిందపడి తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలించిన పోలీసులు



తీవ్రంగా గాయపడిన బట్టు చిరంజీవి రాజు

పుల్‌కల్(అందోల్): కేటాయించిన డబుల్ బెడ్రూం ఇంటిని త్వరగా అందజేయాలని ఓ వ్యక్తి రోడ్డుపై హల్‌చల్ చేసి ప్రమాదానికి గురయ్యాడు. మండల కేంద్రం పుల్‌కల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పుల్‌కల్ గ్రామానికి చెందిన బట్టు చిరంజీవి రాజుకు అతని భార్య మమత పేరుపై పుల్‌కల్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం మంజూరైంది. అయితే వాటిలో కొన్ని పనులు పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులకు కేటాయించలేదు. దీంతో ఇల్లు మంజూరైనా కాలయాపన జరుగుతుండటంతో అసహనానికి గురైన చిరంజీవి రాజు శుక్రవారం ఉదయం పెట్రోలు సీసాతో పుల్‌కల్ ప్రధాన రోడ్డుపై హల్‌చల్ చేశాడు. వచ్చిపోయే వాహనాలను ఆపుతు ఇబ్బంది కలిగించారు. ఇదే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఆపేందుకు ప్రయత్నిస్తుండగా కింద పడిపోయాడు. గమనించిన డ్రైవర్ ఆపే ప్రయత్నం చేస్తుండగానే వెనుక చక్రాలు కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ విజయ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై తహసీల్దార్ రాజయ్య మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులను గుర్తించామని, ఇళ్లను కూడా కేటాయించామని తెలిపారు. చిన్న చిన్న పనులు మిగిలిపోవడంతో కేటాయింపులో జాప్యం జరుగుతోందన్నారు.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో సెకండ్ ఏఎన్‌ఎంలు


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నర్సాపూర్ : తమను రెగ్యులర్ చేయాలన్న డిమాండ్‌తో శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి సెకండ్ ఏఎన్ఎంలు పిలుపునివ్వగా పోలీసులు ముందస్తుగా పలువురిని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ పీసీసీ ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, పార్టీ నాయకుడు అశోక్‌గౌడ్, చిన్న అంజిగౌడ్, సురేష్, అజ్మత్, శ్రీశైలంయాదవ్‌లతోపాటు ఏఐటీయూసీ నాయకుడు నందం తదితరులు స్టేషన్‌కు వెళ్లి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం హామీలు ఇస్తుందే గానీ అమలు చేయడం లేదని వారు విమర్శించారు. మధ్యాహ్నం ఏఎన్‌ఎంలను సొంతపూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు.

భవనాలకు భూమి కేటాయించాలని వినతి

నర్సాపూర్: కులసంఘాల భవనాలకు రెండేసి ఎకరాల భూమి కేటాయించాలని మున్నూరు కాపు కులస్తులు, దళిత సంఘాల నేతలు, ముదిరాజ్ కులసంఘ నేతలు ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని శుక్రవారం కోరారు. మదన్‌రెడ్డి స్పందిస్తూ నియోజకవర్గంలో ఆయా కులాల జనాభా ప్రాతిపదికన భూమి కేటాయించనున్నట్లు చెప్పారు. మున్నూరు కాపు సంఘ నాయకులు బాల్‌రాజ్, శంకర్, నర్సింగ్ రావు, దళితసంఘాల నాయకులు భిక్షపతి, సంజీవ, రాంచందర్ తదితరులు, ముదిరాజ్ సంఘ నాయకులు దశరథ, జగదీశ్వర్ తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


నాగమణి

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందింది. ఈ సంఘటన మాసాయిపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. ఎరుకలవాడలో ఉంటున్న పొట్టొల్ల నాగమణి(38) తన ఇంట్లో అనుమానాస్పదంగా మృతిచెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రామాయంపేట సీఐ లక్ష్మీబాబు, చేగుంట ఎస్ఐ హరీష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి దుస్తులు చిందరవందరగా పడడంతోపాటు శరీరంపై గాయాలను గుర్తించారు. ఆమె భర్త మృతిచెందగా చిన్నశంకరంపేట మండలం శాలిపేటకు చెందిన బ్యాగరి రాములుతో సహజీవనం చేస్తోంది. ప్రస్తుతం రాములు పరారీలో ఉన్నాడు. మృతురాలి కూతురు నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీష్ తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

శివ్వంపేట(నర్సాపూర్): ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన మండల పరిధిలోని తాళ్లపల్లి తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన అన్నదమ్ములు పిల్లలు కేష్యనాయక్, రమేశ్‌నాయక్‌ల మధ్య భూ వివాదం చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. తండా వాసులు కల్పించుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. అనంతరం వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కిరాణా సామగ్రి తెస్తుండగా..


నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్లో) గాయపడ్డ కన్నయ్యలాల్

- స్కూటీ, కారు ఢీకొని ఇద్దరి మృతి
- మరొకరికి గాయాలు
- మృతులంతా ఉత్తరప్రదేశ్‌వాసులు
- తునికి సమీపంలో ఘటన


ప్రమాదస్థలంలో బైక్

కౌడిపల్లి(నర్సాపూర్): బైక్, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఒకరికి గాయాలయ్యాయి. ఈ విషాద సంఘటన మండలంలోని తునికి సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం హర్దోమ్ జిల్లా మదోగంజ్ స్టేషన్ పరిధిలోని సెల్వాపూర్‌కు చెందిన అనుజ్‌కుమార్(22), సరజ్‌కుమార్(19), రైదాస్ కన్నయ్యలాల్, రైదాస్ ప్రమోద్‌కుమార్ మేస్త్రీ పని కోసం గతనెల వచ్చారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి వద్ద ఆబేద్‌ఖాన్ సిమెంట్ ఇటుకలు, సిమెంట్ ప్లేట్స్ పనిచేస్తూనే అక్కడే ఉంటున్నారు. గురువారం రాత్రి కౌడిపల్లి మండలం వెంకటాపూర్‌పేటగేట్ వద్ద కిరాణా సామగ్రి తీసుకుని రెడ్డిపల్లికి పయనం అవుతున్నారు. తునికి రామానాయుడు విజ్ఞానజ్యోతి సమీపంలో 765డి జాతీయ రహదారిపై నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వస్తోన్న కారు, వీరు ప్రయాణిస్తున్న స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అనుజ్‌కుమార్, సరజ్‌కుమార్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కన్నయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలు, క్షతగాత్రుడిని నర్సాపూర్ ప్ర భుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం యూపీకి తరలించారు. కారు డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంగా నడుపుతూ బైక్‌ను ఢీకొనడంతోనే ప్రమాదం జరిగిందని తోటి స్నేహితుడు ఉత్తరప్రదేశ్ వాసి ప్రమోద్‌కుమార్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆగంతకుడి బురిడీ

- యాప్‌లో ఇల్లు అద్దెకు ఉందన్న పోస్టుకు స్పందించాడు
- యజమాని నుంచి రూ.1.98 లక్షలు నొక్కాడు

పటాన్‌చెరు టౌన్: ఓ యాప్‌లో ఇల్లు అద్దెకు ఉందని యజమాని పోస్టు పెట్టారు. ఆగంతకుడి కాల్‌కు స్పందించి నగదు పోగొట్టుకున్నారు. ఈ సంఘటన పటాన్‌చెరు పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... డివిజన్ పరిధిలోని సింఫోని కాలనీకి చెందిన వ్యక్తి ఓ యాప్‌లో ఇల్లు అద్దెకు ఉందని యజమాని పోస్టు పెట్టాడు. జూలై 18న ఆగంతకుడు కాల్ చేశాడు. అతను ఆధార్, పాన్ కార్డులను పంపించాడు. తన అకౌంట్‌కు రూ.5లు పంపమన్నాడు. తిరిగి రూ.10లు యజమాని ఖాతాలో జమ చేశాడు. నగదు రెట్టింపు చేస్తానంటూ దఫాలవారీగా రూ. 39 వేలు, రూ.38,995లు వసూలు చేశాడు. చివరకు 1.98లక్షలు వేసినా ఇంకా వేయాలని అడుగుతుండగా మోసపోయాయని బాధితుడు గుర్తించాడు. వెంటనే సైబర్ క్రైమ్, పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొంతన్‌పల్లిలో త్రిపుల్‌ఆర్ సర్వే

- 70 ఎకరాలు సేకరణ


కొంతన్‌పల్లిలో సర్వే సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండలపరిధి కొంతన్‌పల్లిలో ఔటర్‌రింగు రోడ్డు కోసం భూ సేకరణకు సంబంధించి శుక్రవారం సర్వే చేపట్టారు. కొంతన్‌పల్లిలో గతంలో భూ సర్వే సిబ్బందిని రైతులు అడ్డుకోవడం తెలిసిందే. గురువారం ఆర్‌డీఓ శ్రీనువాసులు భూ నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ నిబంధల ప్రకారం పరిహారం అందిస్తామని, పనులకు సహకరించాల్సిందిగా కోరారు. శుక్రవారం సర్వే డివిజన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ వర్మ సర్వే పనులు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. కొంతన్‌పల్లిలో 70 ఎకరాల భూమి త్రిపుల్ ఆర్ రోడ్డు కోసం సేకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సతీష్ తదితరులు ఉన్నారు.

కళ్లలో కారంచల్లి, రాడ్డుతో బాది

- వ్యక్తి దారుణ హత్య
- వివాహేతర సంబంధమే కారణం
- రాయికోడ్ పీఎస్‌లో లొంగిపోయిన నిందితుడు


కృష్ణ (ఫైల్)


నిందితుడిని చూపుతున్న పోలీసులు

రాయికోడ్(అందోల్): వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఈ సంఘటన నల్లంపల్లిలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు... గ్రామానికి చెందిన ఎం.కృష్ణ (35)కు, ఝరాసంగం మండలం ఎల్గోయికి చెందిన మహిళతో 2008లో వివాహమైంది. కొన్నాళ్ల పాటు వారి కాపురం సజావుగానే సాగింది. ఈ క్రమంలో నల్లంపల్లికి చెందిన మూలగోలి ప్రశాంత్‌తో కొంతకాలంగా ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. భర్తకు ఈ విషయం తెలియడంతో ఇద్దరి మధ్య తరుచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 10 నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. అతను మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి అతడు బీడీలు తెచ్చుకుంటానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లాడు. ఇంతలో భగీరథ వాటర్ ట్యాంక్ సమీపాన ప్రశాంత్‌కు కృష్ణ ఎదురుపడ్డాడు. అప్పటికే మద్యంమత్తులో ఉన్న ప్రశాంత్.. కృష్ణ కారంపొడిని కంట్లో కారం పొడి చల్లి ఇనుప రాడ్డుతో తలపై మోదాడు. కిందపడిపోయిన తర్వాత కూడా తలపై బీరుసీసాతో విచక్షణా రహితంగా పొడిచి, ప్రధాన రహదారిపై నుంచి కొంతదూరం లాక్కెళ్లి పడేశాడు. నిందితుడు శుక్రవారం తెల్లవారుజాము రాయికోడ్ స్టేషన్‌లో లొంగిపోయాడు. కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం, ఎస్ఐ తరలించారు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

గిరిజనులకు ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలి

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లాలో యూనిట్‌గా తీసుకుని జనాభా ప్రతిపాదికన గిరిజనులకు ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్న జిల్లాలవారీగా చట్టసభల్లో గిరిజనులకు అవకాశం కల్పించలేదన్నారు. ఎస్సీల మాదిరిగానే గిరిజనులకు కూడా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలన్నారు.

కాంగ్రెస్ ఫిషర్‌మెన్ జిల్లా అధ్యక్షుడిగా హరిప్రసాద్

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ ఫిషర్‌మెన్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా రామాయంపేటకు చెందిన రొయ్యల హరిప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ ఫిషర్‌మెన్ విభాగం రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ ఉత్తర్వులు జారీచేశారు. డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి నియామక పత్రాన్ని శుక్రవారం హరిప్రసాద్‌కు అందజేశారు. తన నియామకానికి సహకరించిన తిరుపతిరెడ్డి, తదితరులకు హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

కాటేసిన కరెంట్ తీగలు

- విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి, మరొకరికి గాయాలు
- కంకర అన్‌లోడ్ చేస్తుండగా ట్రాలీని తాకిన వైరు


కృష్ణ


ఘటన స్థలంలో ట్రాక్టర్, పైన విద్యుత్ తీగలు

ములుగు(గజ్వేల్): కంకర అన్‌లోడ్ చేస్తుండగా విద్యుత్ తీగలు ట్రాలీకి తగిలి ఆపై వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరోవ్యక్తికి గాయాలయ్యాయి. ఈ విషాద ఘటన ములుగు మండలం కమలాబాద్‌లో శుక్రవారం జరిగింది. ములుగు పోలీసుల కథనం ప్రకారం... కమలాబాద్‌కు చెందిన ములుగు కృష్ణ(29) కంకర లోడు తరలింపునకు కిరాయి మాట్లాడుకున్నాడు. గ్రామ సమీపాన ఉన్న మామిడితోటలో అన్‌లోడ్ చేసేందుకు వరుసకు సోదరుడైన కసుకరాజును వెంట తీసుకువెళ్లాడు. అన్‌లోడ్ చేస్తుండగా ట్రాక్టర్ ట్రాలీని పైకి లేపాడు. ఈ క్రమంలో 11 కేవీ విద్యుత్ తీగలు ట్రాలీకి తాకాయి. ఈ ప్రమాదంలో కృష్ణ కిందపడిపోయాడు. అతడిని కాపాడే ప్రయత్నంలో కసుకరాజుకు గాయాలయ్యాయి. ట్రాక్టర్ టైర్లు కాలిపోయాయి. కాగా వెంటనే ఇద్దరినీ లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. కృష్ణను పరీక్షించిన వైద్యులు మృతిచెందాడని తెలిపారు. కసుకరాజు చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య శోధన, కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆసరాగా అన్నీ తానై కుటుంబపోషణ బాధ్యతలు చేపడుతున్న కృష్ణ మృతితో తల్లితండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


ఎస్ఐని సన్మానిస్తున్న గ్రామస్తులు

తూప్రాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శివానందం అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని యావపూర్ గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు చాలా తెలివిగా బ్యాంకు అకౌంట్ల నంబర్లు, పిన్ నంబర్లు, ఆఫర్లు వచ్చాయని, అధిక లాభాల కోసం పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో అమాయకులను దోచుకుంటున్నారని తెలిపారు. అలాంటి వారిపై జాగ్రత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికి వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దన్నారు. అనంతరం గ్రామస్తులు నూతనంగా వచ్చిన ఎస్ఐని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలి


లెర్నింగ్ లైసెన్స్‌లు అందిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డ్రైవింగ్ వచ్చిన వారు లైసెన్స్‌ను కలిగి ఉండాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక అసెంబ్లీ పరిధిలోని 425 మంది యువతకు సిద్దిపేట జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో లెర్నింగ్ లైసెన్స్‌లు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరగకుండా అందరం బాధ్యత తీసుకోవాలన్నారు.
డ్రైవింగ్ తెలిసినవారు లైసెన్స్‌లు తీసుకోవాలన్న లక్ష్యంతో మంత్రి హరీశ్‌రావు కృషితో మెదక్ పార్లమెంట్ పరిధిలోని యువతకు ఉచితంగా వాటిని అందిస్తున్నామన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోల్‌లో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి దుర్గప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దొంగలకు రిమాండ్

- 8 మందిలో పట్టుబడిన ఇద్దరు నిందితులు
- పెద్దాపూర్ చోరీ కేసు విచారణలో కదిలిన డొంక

సిద్దిపేటరూరల్: వ్యవసాయ బావుల వద్ద కరెంట్ వైర్లు చోరీకి పాల్పడుతున్న 8 మందిలో నూనె స్వామి, కూరకుల ఆంజనేయులు అనే ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు పంపినట్లు సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి తెలిపారు. వీరి నుంచి 4 కిలోల రాగివైర్ స్వాధీనం చేసుకున్నారు. మరో ఆరు నిందితులు పర్వతం శ్రీనివాస్, టీ యాదగిరి, టీ షాదూల్, పర్వతం రాజు, టీ సాయిలు, నూనె సాయికుమార్ పరారీలో ఉన్నారన్నారు. సదాశివపేట పెద్దాపూర్‌లో ఓ చోరీ కేసులో విచారణలో భాగంగా వీరు పోలీసులకు పట్టుబడ్డారన్నారు. గతంలో తొమ్మిది కేసులో నిందితులుగా ఉన్నారని ఏసీపీ తెలిపారు.

అటవీప్రాంతంలో మృతదేహం లభ్యం


అటవీ ప్రాంతంలో పోలీసులు

రామాయంపేట(మెదక్): ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఈ సంఘటన నార్సింగి మండలం సంకాపూర్ అటవీప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అటవీప్రాంతంలో పనిచేసే వాచర్, మృతదేహాన్ని చూసి సర్పంచ్ సుజాత శ్రీనివాస్‌కు సమాచారం అందజేశాడు. వారు పోలీసులకు విషయాన్ని చెప్పారు. వారు ఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. సుమారుగా 20 రోజుల క్రితం సదరు వ్యక్తి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని కుక్కలు, అడవి జంతువులు పీక్కు తిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. నార్సింగి ఎస్ఐ నర్సింలు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి దుర్మరణం

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. చిన్నకోడూరులో ఒకరు, వటపల్లిలో మరొకరు, గజ్వేల్ రూరల్‌లో వృద్ధురాలు చనిపోయారు.

అల్లుడికి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసి వస్తూ..

బైక్, ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు దుర్మరణం


తిరుపతిరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): బైక్, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొని రైతు మృతిచెందాడు. ఈ సంఘటన గుర్రాలగొంది శివారులో శుక్రవారం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం..విఠలాపూర్ వాసి, రైతు చెలుకల తిరుపతిరెడ్డి(53) సిద్దిపేటలో ప్లాట్ ఉంది. దానిని అక్కడే ఉంటున్న అల్లుడు రాజిరెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. గుర్రాలగొందిలోని బ్యాంక్‌లో నగదు డ్రా చేసుకొని తిరుగుపయనంలో శివారు వద్ద అతను ప్రయాణిస్తున్న బైక్, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అతను ఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతుడి కుమారుడు చెలుకల రమేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కూతురు శిల్ప ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


బీమ్లానాయక్ మృతదేహం

వటపల్లి(అందోల్): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన అల్మాయిపేట గ్రామశివారులో శుక్రవారం చోటుచేసుకుంది. జోగిపేట ఎస్ఐ పెంటయ్య కథనం ప్రకారం.. పుల్కల్ మండలం గొంగులూర్‌తండాకు చెందిన బీమ్లానాయక్(55) జోగిపేటలో బోరు మోటారు రిపేర్ చేయించుకొని తిరుగు పయనవుతున్నాడు. అల్మాయిపేట సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కకు బైక్ పార్క్ చేశాడు. అనంతరం 161 రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న జోగిపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మనుమడిని తీసుకొచ్చేందుకు వెళ్లి..


ఎల్లవ్వ

గజ్వేల్‌రూరల్: మనుమడిని తీసుకువచ్చేందుకు వెళ్లిన వృద్ధురాలు ఆ స్కూల్ బస్సు ఢీకొని మృతిచెందింది. ఈ సంఘటన గజ్వేల్ మండలం సింగాటంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సింగాటంకు చెందిన దార ఎల్లవ్వ(60) మనువడు అచ్యుత్ గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. సాయంత్రం అచ్యుత్‌ను ఎడమ వైపు వదిలిపెడుతోంది. ఆ వైపునకు వెళ్లేందుకు ఎల్లవ్వ యత్నించింది. ఇది గమనించని డ్రైవర్ బస్సును పోనివ్వడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎల్లవ్వ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆత్మీయులకు కన్నీళ్లు మిగిల్చి...

ఆత్మీయులకు కన్నీళ్లు మిగిల్చి, తిరిగిరాని లోకాలకు వెళ్లారు. బలవన్మరణంతో కుటుంబసభ్యులకు తీరని వ్యథ మిగిల్చారు. పటాన్‌చెరు, చిన్నకోడూరు, జహీరాబాద్, కోహెడ రూరల్‌లో ఆత్మహత్య సంఘటనలు చోటుచేసుకున్నాయి.

భార్య కాపురానికి రావడం లేదని..


కిషన్

పటాన్‌టౌన్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపనతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లయ్య కథనం ప్రకారం... ఐలాపూర్ పెద్దతండా వాసి కిషన్(37) లారీ డ్రైవర్. ఆరు నెలల క్రితం భార్య వాణి గొడవపడ్డాడు. ఈ క్రమంలో పిల్లలను తీసుకొని భార్య మియాపూర్‌లోని పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి అతడు మద్యానికి బానిసయ్యాడు. 3 నెలల క్రితం మియాపూర్‌కు వెళ్లి భార్యను ఇంటికి రావాలని కోరా డు. రానని చెప్పింది. గురువారం మరోసారి రావా లని అడగగా రానంది. శుక్రవారం ఉదయం ఐలాపూర్‌లోని ఇంటిలో అతడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక..

చిన్నకోడూరు(సిద్దిపేట): కడుపు నొప్పి భరించలేక వృద్ధురాలు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన చౌడారంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన వాసి బైకని బాలవ్వ(70) గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో గురువారం రాత్రి వరకు రెండో కుమారుడు పర్శయ్య ఇంట్లోనే ఉంది. రాత్రి పాత ఇంట్లో నిద్రించింది. శుక్రవారం ఉదయం తలుపులు తెరవకపోవడంతో కిటికీలోంచి చేస్తే ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్ఐ సుభాష్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుమారుడు పర్శయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో వివాహిత..

జహీరాబాద్: జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని కాశీంపూర్‌లో చోటుచేసుకుంది. చిరాగ్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజు కుమార్తె భవానీ(18)కి మన్నాపూర్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. కుటుంబ కలహాల కారణంగా ఆరు నెలలుగా భవానీ పుట్టింటి వద్దే ఉంటోంది. కాగా ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఆమె ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు కారణాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు. తండ్రి రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవమానంతో వ్యక్తి..


కనకయ్య

కోహెడరూరల్ (హుస్నాబాద్): అవమానం భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని తంగళ్లపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర కనకయ్య(52)కు అదే గ్రామానికి చెందిన బుర్ర నాగభూషణంతో గొడవైంది. ఈ ఘర్షణలో బుర్ర కనకయ్యపై ముఖంపై అతడు ఉమ్మి వేసి తిట్టాడు. ఈ క్రమంలో దీనిని అవమానంగా భావించిన మనస్తాపంతో కనకయ్య ఇంటి దగ్గర ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.